
# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 42 | పేజీలు: 4 | వెల: 4/- | మంగళవారం ● 03, సెప్టెంబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాల్సిందే

### రాజ్యసభ సభ్యుడు సింఘ్వి డిమాండ్



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2(నమస్తే ఉదయం):** పలు రాష్ట్రాల్లో అధికార ప్రభుత్వం, గవర్నర్ మధ్య విభేదాలు కొనసాగుతున్న క్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వి కీలక వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ పదవిని పూర్తిగా రద్దు చేయాలని అన్నారు. అలా కానీ పక్షంలో ఎటువంటి రాజకీయలకు సంబంధం లేని ఉన్నతస్థాయి వ్యక్తులను మాత్రమే ఏకాభిప్రాయంతో నియమించాలని డిమాండ్ చేశారు. తాజాగా ఆయన ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.ఈ ప్రభుత్వం అతిపెద్ద వైఫల్యం ఏమిటంటే.. ప్రతీ సంస్థను కించపర్చటం, దాని విలువ తగ్గించటం. కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్లు రెండో చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా వ్యవహరించిన సందర్భాలు

మిగతా.. 2లో



## జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- వర్షాల వల్ల రాష్ట్రంలో 5438 కోట్ల నష్టం
- పంట దెబ్బతిన్న ప్రతి ఎకరానికి 10 వేలు పరిహారం
- ప్రతి ఇంటికి తక్షణ సాయంగా రూ.పదివేలు
- పర్యటించాలని ప్రధానమంత్రి మోదీకి విజ్ఞప్తి చేశా
- తెలంగాణలో ప్రతిపక్ష నేత మౌన ముద్ర
- జాతీయ విపత్తుగా ప్రకటించాలని బీఆర్ఎస్ ఎందుకు అడగడం లేదు?
- ఖమ్మం సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**ఖమ్మం,సెప్టెంబర్ 2(నమస్తే ఉదయం):** భారీ వర్షాల వల్ల జనజీవితం అతలాకుతలం అయింది. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారు. భారీ వర్షాల వల్ల 16 మంది ప్రాణాలు కోల్పోయారు. క్షేత్రస్థాయి నష్టాలను పరిశీలించేందుకు వచ్చాను. ప్రభుత్వం అండగా ఉంటుందనే విశ్వాసం కల్పిస్తున్నాం.

వరదల కారణంగా అంటురోగాలు వచ్చే ప్రమాదం ఉంది. వైద్య ఆరోగ్య శాఖాధికారులు చర్యలు తీసుకోవాలి. తక్షణం స్పందించడం ద్వారా నష్టాన్ని తగ్గించాం. భేషజాలకు పోకుండా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సాయం కోరాం. తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాం. నాలుగు నుంచి ఐదు లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. వర్షాల వల్ల రాష్ట్రంలో 5438 కోట్ల నష్టం జరిగింది.



తెలంగాణ లో పర్యటించాలని ప్రధానమంత్రి మోదీకి విజ్ఞప్తి చేశాను. ఇది కష్ట సమయం. పక్క రాష్ట్రంలో ప్రతిపక్ష నేత ప్రజల దగ్గర కు వెళ్తున్నారు. తెలంగాణలో ప్రతిపక్ష నేత మౌన ముద్ర దాల్చారు. కేటీఆర్ అమెరికాలో ఎంజాయ్ చేస్తూ మంత్రులు పనిచేయడం లేదని విమర్శలు చేస్తున్నారు. జాతీయ విపత్తుగా ప్రకటించాలని బీఆర్ఎస్ ఎందుకు అడగడం లేదు?

మిగతా.. 2లో



ట్రిబుల్ ఐటీ పూర్వ విద్యార్థి పాలూరి మహనోహర్ తల్లిదండ్రులకు అవార్డు అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్, ట్రిబుల్ ఐటీ డైరెక్టర్ పి జే నారాయన్



కార్యక్రమంలో పాల్గొన్న కుటుంబ సభ్యులు

## 'ఐరెస్ట్ రోడ్ సేఫ్టీ ప్రాజెక్ట్' ప్రధాని మోడీ ప్రశంసించి
# దేశవ్యాప్తంగా అమలు చేయాలని సూచన

### -తెలంగాణ ప్రభుత్వం, ట్రిపుల్ ఐటీ, ఇంటెల్ సంయుక్త కష్టానికి ప్రతిఫలం

### రాష్ట్ర ఐటీ శాఖా ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ - ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ 27వ ఫౌండేషన్ డే కార్యక్రమం

**హైదరాబాద్, సెప్టెంబరు 2(నమస్తే ఉదయం):** తెలంగాణ ప్రభుత్వం, ట్రిపుల్ ఐటీ హైదరాబాద్, ఇంటెల్ సంస్థ సంయుక్తంగా రూపొందించిన 'ఐరెస్ట్ రోడ్ సేఫ్టీ ప్రాజెక్ట్'ను దేశ ప్రధాని నరేంద్రమోడీ ప్రశంసించడంతో పాటు దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరుకుంటున్నారని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖా ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. సోమవారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని ట్రిపుల్ఎటీ ప్రాంగణంలో ట్రిపుల్ ఐటీ 27వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం, ట్రిపుల్ ఐటీ, ఇంటెల్ సంస్థల సంయుక్త కృషికి ఈ ప్రశంస నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీ అనేక పారమితులపై అత్యధిక ర్యాంకుల్ని కలిగి ఉండటం, ముఖ్యంగా ఏఐలో దేశంలోని అత్యుత్తమ ఇంజనీరింగ్ ఇన్స్టిట్యూట్లలో ఒకటిగా పరిగణించబడటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్లో ఉండడంతో తెలంగాణ ప్రభుత్వం గర్విస్తోందన్నారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పిజే నారాయణన్ మాట్లాడుతూ... ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ సిల్వర్ జూబ్లీ వేడుకల గ్రాండ్ ఫినాలే ఈరోజుతో ముగిసిందన్నారు. మా పూర్వ విద్యార్థుల సంఘం ఎంతో బలమైన బృందాన్ని కలిగి ఉందన్నారు. తమ వృత్తిలో రాణిస్తూ సమాజానికి, ఇన్స్టిట్యూట్కు గణనీయమైన సేవలను చేసిన పూర్వ విద్యార్థులకు అవార్డులతో సత్కరించాలని నిర్ణయించామని గుర్తు చేశారు. అనంతరం నోటి క్యాన్సర్ గుర్తింపు, కంప్యూటేషనల్ డ్రగ్ డిస్కవరీ, ప్రకృతి సంభాషణ కోసం జియోస్పేషియల్ సొల్యూషన్స్, భూకంపం, డ్రోన్ ఆధారిత బిల్డింగ్ సేఫ్టీ అసెస్మెంట్స్, బ్రేయిస్వాపింగ్, షేప్ షిఫ్టింగ్ డ్రోన్లు, ఆర్నిథాప్టర్ లాంగ్వేజ్ కోసం ఏఐని ఉపయోగించడం నుంచి రూపొందించిన వాటి గురించి రూపొందించిన ప్రదర్శనను ఆయన తిలకించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### 'పూర్వ విద్యార్థులకు అవార్డుల ప్రధానం.

ట్రిపుల్ఎటీ హైదరాబాద్లోని పూర్వవిద్యార్థులకు అత్యుత్తమ అవారుల ప్రధానం కార్యక్రమంలో భాగంగా 2024గాను అలుమిని ఔట్ స్టాండింగ్ సర్వీస్-2024 అవార్డును ఇద్దరు పూర్వ విద్యార్థులకు అందించారు. పూర్వవిద్యార్థులు విప్పుటికేడియా సౌజన్యలంకా ఇద్దరు ట్రిపుల్ ఐటీ పూర్వవిద్యార్థులుగా చేసిన సేవలను గుర్తించి వారికి ఈ అవార్డుకు ఎంపిక చేయడంతో వారికి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఐటీ శాఖా ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పిజే నారాయణన్ చేతుల మీదుగా అందించారు.





రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం

### నేడు వ్యవసాయ విశ్వవిద్యాలయం
# 10వ వ్యవస్థాపక దినోత్సవం

**రాజేంద్రనగర్, సెప్టెంబర్2(నమస్తే ఉదయం):** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ వ్యవస్థాపక దినోత్సవం సెప్టెంబర్ 3వ తేదీన నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ పి. రఘురామి రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం ఆడిటోరి యంలో జరగనున్న వ్యవస్థాపక దినోత్సవ కార్యక్ర మానికి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ బి జే రావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని ఆయన తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎం. రఘునందన్ రావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. 2014లో ఏర్పాటైనప్పటి నుంచి వ్యవసాయ విశ్వ విద్యాలయం జాతీయస్థాయిలో అనేక ఉన్నత శిఖరాల్నిఅందుకుందని రఘురామిరెడ్డి వివరించారు. ఈ పదేళ్లలో 5 కొత్త వ్యవసాయ కళాశాలలు, ఒక ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల, 4 వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల్ని ప్రారంభించినట్లు తెలిపారు. సీట్ల సంఖ్యను 1360 కి పెంచడం జరిగిందన్నారు.

అమెరికాలోని అబర్న్ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ లో పీజీ కోర్సు అభ్యసించేందుకు విద్యార్థులకి ఓవర్సీస్ ఫెలోషిప్ అందించడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో విశ్వవిద్యాలయం తీసుకున్న చర్యల వల్ల 2024 సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ, అనుబంధ విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం 37 వ స్థానాన్ని సాధించిందని వివరించారు. 2017 లో ఐ సీఏఆర్ ప్రకటించిన ర్యాంకుల్లో వ్యవసాయ విశ్వ విద్యాలయం జాతీయస్థాయిలో 6వ స్థానంలో నిలిచింది.



రిజిస్ట్రార్ డాక్టర్ పి రఘురామిరెడ్డి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15 పరిశోధన స్థానాల ద్వారా అన్ని ప్రధాన పంటల్లో విస్తృత పరిశోధనలు చేపడుతున్నట్లు తెలిపారు. వరి, మొక్కజొన్న, జొన్న, అపరాలు వంటి ప్రధాన పంటల్లో ఇప్పటివరకు 67 నూతన వంగడాలని విడుదల చేశామన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన తెలంగాణ సోనా-వరి వంగడం జాతీయస్థాయిలో బాగా ఆదరణ పొందిందని తెలిపారు.

దేశంలోనే తొలిసారిగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డ్రోన్ అకాడమీని నెలకొల్పిందని రఘురామి రెడ్డి వివరించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం కి చెందిన తాండూర్ కంది జీ ఐ గుర్తింపును సాధించిందని రఘురామి రెడ్డి తెలిపారు. వ్యవసాయంలో స్టార్టప్ ల్ని ప్రోత్సహించేందుకు

మిగతా.. 2లో

### మరో 11 జిల్లాలకు
# భారీ వర్ష సూచన

- ముందస్తు చర్యలపై ఆ 11 జిల్లాల కలెక్టర్లు, ఎస్.పీలతో సి.ఎస్. టెలీకాన్ఫరెన్స్

**హైదరాబాద్,సెప్టెంబర్ 2(నమస్తే ఉదయం):** రేపు కూడా రాష్ట్రంలోని దాదాపు 11 జిల్లాల్లో భారీ వర్షాలుంటాయని వాతావరణ శాఖ హెచ్చరించినందున ఆయా జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. రానున్న 24 గంటలలో భారీ వర్షాలు కురిసే హెచ్చరికలున్న 11 జిల్లాలైన ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కొమరం భీం ఆసిఫాబాద్, మెదక్,మేడ్చల్ మల్కాజిగిరి, నిర్మల్, నిజామాబాద్,



పెద్దపెల్లి, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాల కలెక్టర్లు, ఎస్.పీ లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి ఆయా జిల్లాల్లో వరదల పరిస్థితి, పునరావాస, సహాయక చర్యలను సమీక్షించారు. డీజీపీ జితేందర్, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విందే కుమార్, ఫైర్ సర్వీసుల డీజీ నాగి రెడ్డి, నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ కూడా ఈ టెలి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి

మిగతా.. 2లో



## వ్యవసాయ విశ్వవిద్యాలయంతో విత్తన కంపెనీల అవగాహన ఒప్పందం

వ్యవసాయ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న విత్తన పరిశ్రమలు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్2(నమస్తే ఉదయం):** మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాలకు జాతీయస్థాయిలో మార్కెటింగ్ కల్పించడానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కర్నూలుకు చెందిన చక్రా సీడ్స్ అలాగే సాయికృష్ణ సీడ్స్ కంపెనీలు సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి.

రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి కంపెనీ ప్రతినిధులు అవగాహన పత్రాలపై సంతకాలు చేసి ఒకరి కొకరు మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ విద్యాలయం ఉన్నతాధి కారులు అలాగే, చక్రా సీడ్స్, సాయికృష్ణ సీడ్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన డిహెచ్ఎం-206 హైబ్రిడ్ మొక్కజొన్న రకానికి జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు ఆయా సంస్థలు కృషి చేయనున్నాయని రిజిస్ట్రార్ డాక్టర్ రఘురాం రెడ్డి అన్నారు. అధిక దిగుబడి నిచ్చే ఈ డిహెచ్ఎం 206 హైబ్రిడ్ హెక్టార్కు 10 టన్నుల వరకు దిగుబడి రానున్న ఇవన్నీ అన్నారు అలాగే చార్కోల్ రాట్ తెగులను తట్టుకొని హైబ్రిడ్‌గా ఇది ప్రాచుర్యం పొందింది. జాతీయ స్థాయి ఆమోదంతో ఈ నూతన హైబ్రిడ్ హైబ్రిడ్ ను విశ్వవిద్యాలయం విడుదల చేసింది.

ఈ హైబ్రిడ్ ఉత్తరభారత దేశంలోని పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, జారండ్, బీహార్, ఒడిస్సా వంటి రాష్ట్రాలకు ఎంతో అనుకూలమని రిజిస్టర్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని మొక్కజొన్న పరిశోధన కేంద్రం నుంచి విడుదలైన డి హెచ్ఎం-117, డిహెచ్ఎం-121 వంటి హైబ్రిడ్ వండాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు గతంలో 43 సంస్థలతో అవగాహన ఒప్పందాలు నేర్చుకోవడం జరిగింది.

## రాజకీయంగా సోషల్ మీడియాలో బతికేస్తున్న కేటీఆర్, హరీష్

- ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అర్ధ రహితం
- బిఆర్ఎస్ పాలకుల మాదిరిగా గడీల్లో పడుకోలేదు ప్రజల మధ్యన ఉండి సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నాం
- ప్రభుత్వం హై అలర్ట్‌గా ఉన్నందునే స్వల్ప ప్రాణ నష్టం కూడా జరగలేదు
- అర్ధరాత్రి కూడా పనిచేస్తూ విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూస్తున్న సిబ్బందికి అభినందనలు
- ఖమ్మంలో జరిగిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



**ఖమ్మం,సెప్టెంబర్ 2(నమస్తే ఉదయం):** ప్రతిపక్షాలు ప్రజా ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు పనికి మాలినవని వాళ్లు చేసిన పాపాలపై నిలదీస్తారన్న భయంతో ప్రజల్లోకి వచ్చే ధైర్యం లేక ట్విట్టర్ ఫేస్బుక్ వాట్సప్ సోషల్ మీడియాలో కేటీఆర్ హరీష్ రావు రాజకీయంగా బతికేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. అనుకోని విధంగా వచ్చిన ఈ విపత్తును ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వం హై అలర్ట్‌గా ఉన్నందునే రాష్ట్రంలో ఎక్కడ స్వల్ప ప్రాణనష్టం కూడా జరగలేదని వెల్లడించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి దివంగత

మిగతా.. 2లో

### నేడు వ్యవసాయ విశ్వవిద్యాలయం

## 10వ వ్యవస్థాపక దినోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించిన అగ్రి హబ్ మంచి పురోగతి సాధిస్తుందన్నారు. 9 డాట్ కేంద్రాలు, 8 కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా రాష్ట్ర రైతాంగానికి విస్తృతంగా విస్తరణ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్ విభాగం, రాష్ట్ర వ్యవసాయ శాఖ కలిసి రూపొందించిన 'రైతు నేస్తం' అనే ప్రత్యక్ష చర్చా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీ, 2024న ప్రారంభించారని రఘురామి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకూ 556 రైతు వేదికల్ని అనుసంధానం చేసి సుమారు లక్ష 30 వేల మంది రైతులకి సలహాలు, సూచనలు అందించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో భవిష్యత్తులో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు పునరంకితం అవుతామని రఘురామి రెడ్డి ప్రకటించారు. 10వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పలువురు రైతులకు, బోధన, బోధనేతర సిబ్బందికి అవార్డులను అందజేయనున్నారు.

## మరో 11 జిల్లాలకు భారీ వర్ష సూచన

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ, భారీ వర్షాలు కురిసే అవకాశమున్న ఈ జిల్లాల కలెక్టర్లు ముందస్తు ప్రణాళిక రూపొందించుకొని ఏవిధమైన ఆస్తి, ప్రాణ నష్టం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పటికే గత నాలుగైదు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున, రానున్న భారీ వర్షాల వలన పరిస్థితులు తీవ్రంగా ఉండే అవకాశముందని పోలీసు తదితర శాఖల సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

స్థానిక పరిస్థితుల దృష్ట్యా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించే విషయం జిల్లా కలెక్టర్లే నిర్ణయించుకోవాలన్నారు. స్వర్ణ, కడెం ప్రాజెక్టుల గేట్లను తెరవడంతో లోతట్లు ప్రాంతాల ప్రజలను సరక్షిత ప్రాంతాలకు తరలించాలని నిర్మల్ కలెక్టర్ ను ఆదేశించారు. నిర్మల్ కు 31 సభ్యులు, నాలుగు బొట్లు ఉన్న NDRF బృందాన్ని పంపుతున్నామని తెలిపారు. SRSP ప్రాజెక్ట్ నుండి ప్రస్తుతం 20000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, ఈ నీటి పరిమాణం ఎక్కువైతే నేడే పరీవాహక ప్రాంతాల్లో తగు ముందు జాగ్రత చర్యలను చేపట్టాలని తెలియ చేసారు. మహారాష్ట్ర పరీవాహక ప్రాంతం నుండి వచ్చే నీటి పరిమాణాన్ని ఎప్పటి కప్పుడు తెలుసుకొని తగు జాగ్రత్తలు చేపట్టేందుకు మహారాష్ట్ర అధికారులతో కోఆర్డినేట్ చేసుకోవాలని సూచించారు. కల్వర్టులు, వాగుల వద్ద సంబంధిత లైన్ డిపార్ట్మెంట్‌ల అధికారులతో జాయింట్ టీమ్‌లను ఏర్పాటు చేసి నిఘా ఉంచాలని అన్నారు. హైదారాబాద్ నుండి ఏవిధమైన సహాయ సహకారాలు కావాలన్న తమను సంప్రదించాలని కలెక్టర్లను కోరారు. జిల్లా కలెక్టరేట్ లలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లు 24/7 పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

డీజీపీ జితేందర్ మాట్లాడుతూ, రేపటి వరకు భారీ వర్ష సూచన ఉన్న జిల్లాల్లో ఎస్.పీ లు జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని పనిచేయాలని ఆదేశించామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించడానికి క్రేన్ లను కూడా సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపామన్నారు.

### రాజకీయంగా సోషల్ మీడియాలో

## బతికేస్తున్న కేటీఆర్, హరీష్

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైయస్సార్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలకు పని లేకుండా ఉన్నారని వారు చేస్తున్న విమర్శలు ప్రజలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. గత బిఆర్ఎస్ పాలకుల మాదిరిగా ప్రజా ప్రభుత్వంలో ఉన్న మంత్రులు గడిల్లో పడుకోలేదని, ప్రజల మధ్యన ఉండి సహాయక చర్యలు చేశామన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యే వరకు అందరూ ప్రజల మధ్యన ఉండి ప్రతిక్షణం పర్యవేక్షిస్తూ ప్రజలకు సహాయక చర్యలు చేపట్టడం వల్లనే భారీగా వచ్చిన ఈ విపత్తులను అధిగమించామన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో కొద్దిపాటి వర్షం పడితే జంట నగరాలు మునిగి పోయినవని. కానీ ఇంత పెద్ద విపత్తు వచ్చిన హైదరాబాదు నేడు సురక్షి తంగా ఉన్నదంటే ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా ఫలి తమే అన్నారు. చెరువుల ఆక్రమణలు తొలగిస్తూ వాటి పరిరక్ష ణకు చర్యలు తీసుకుంటున్న హైడ్రా ప్రస్తుతం ఈ విపత్తును ఎదుర్కోవడానికి రెడీగా ఉందన్నారు. ఇప్పటికే రెస్క్యూ ఆపరేషన్ టీంలను రంగంలోకి దింపిందన్నారు. ఎలాంటి పరిస్థితులైన ఎదుర్కోవడానికి హైడ్రా సిద్ధంగా ఉందని చెప్పారు.విద్యుత్ అంతరాయం లేకుండా చూడడానికి సిబ్బంది ఉరుములు మెరుపులు మధ్యన పిడుగులు పడుతున్న ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అర్ధరాత్రులు రోడ్లపైనే ఉండి యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేస్తూ సేవలు అందించిన విషయం ప్రతిపక్షాలకు కనబడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్యోగ ధర్మం కాకుండా సామాజిక ధర్మాన్ని పాటిస్తూ అర్థరాత్రులు సైతం విధులు నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని అభినందించారు.

### నిరాశ్రయులకు తక్షణమే నిత్యావసర సరుకులు పంపిణీ

భారీ వర్షాలు కురవడం వల్ల పొంగి పొర్లిన వరదల వల్ల నిరాశ్రయులైన వారికి తక్షణమే నిత్యవసర సరుకులను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నదని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇప్పటికే పునరావస కేంద్రాలకు తరలించిన ప్రజలకు భోజన వసతితో పాటు వారికి మెరుగైన వైద్య సేవలను ప్రభుత్వ యంత్రాంగం అందించిందన్నారు.వరదలు తగ్గిన తర్వాత నష్టం అంచనా వేయించి ప్రభుత్వం బాధితులను ఆదుకుంటుందని చెప్పారు. వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా వైద్య ఆరోగ్యశాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఖమ్మంలో మున్నేరు ఉప్పొంగడంతో కొంతమేర నష్టం జరిగిందన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

చాలా ఉన్నాయి. అందుకే గవర్నర్ పదవిని పూర్తిగా రద్దు చేయాలి. లేదంటే రాజకీయలకు సంబంధంలేని వ్యక్తిని మాత్రమే నియమించాలి. ఒకవేళ రాష్ట్ర ముఖ్యమంత్రికి, గవర్నర్‌కు మధ్య విభేదాలు తలెత్తితే వెంటనే గవర్నర్‌ను తెలగించాలి. ఎందుకంటే ఎన్నికల ప్రకియలో ప్రజలు ముఖ్యమంత్రిని ఎన్నుకుంటారు కానీ గవర్నర్ కాదు. ప్రస్తుతం గవర్నర్ల తీరు వల్ల పరిపాలన కష్టంగా మారుతోంది. ప్రభుత్వం చేసని కొన్ని ముఖ్యమైన బిల్లులను గవర్నర్లు ఆమోదించకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కర్ణాటక రాష్టాల్లో ప్రభుత్వానికి, గవర్నర్ మధ్య వివాదాలు చెలరేగుతున్న నేపథ్యంలో అభిషేక్ మను సింఘ్వీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయంశంగా మారాయి. మరోవైపు.. సింఘ్వీ ఇటీవల తెలంగాణ రాజ్యసభ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## కడెం ప్రాజెక్టును పరిశీలించిన శ్రీధర్ బాబు

**నిర్మల్, సెప్టెంబర్ 2(నమస్తే ఉదయం):** నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టును మంత్రి శ్రీధర్ బాబు, ఎంఎల్ఏ బొజ్జు పటేల్ పరిశీలించారు. కడెం ప్రాజెక్టులోకి కొనసాగుతున్న వరద పరిస్థితి, వరద గేట్ల ద్వారా విడుదల చేస్తున్న నీటి వివరాలు, ప్రాజెక్టు వద్ద చేపట్టిన అప్రమత్త చర్యలు వంటి పూర్తి వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. రైతులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి ఉన్నందున ఎవరూ గోదావరి పరివాహక ప్రాంతాలకు వెళ్లకూడదని మంత్రి సూచించారు.

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

### - మాజీ కౌన్సిలర్ కోరిని దయానంద్

**రాజేంద్రనగర్,సెప్టెంబర్ 02(నమస్తే ఉదయం):** స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని రాజేంద్రనగర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మాజీ కౌన్సిలర్ కోరిని దయానంద్ (డేవిడ్)అన్నారు. సోమవారం రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్ చౌరస్తాలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోరిని దయానంద్ మాట్లాడుతూ...

వైఎస్ఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాల్లో ప్రతి పేద వాడి ఇంటికి ఏదో ఒకటి చేరిందని అన్నారు.

బడుగు,బలహీన,పేద వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా నిరంతరం కృషి చేసిన మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి..ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే రైతులకు ప్రయోజనం కలిగేలా ఉచిత విద్యుత్‌ను అందించారని,విద్యార్థులకు రియంబర్స్‌మెంట్,108 వాహన సదుపాయం, పేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం, రేషన్‌కార్డుల జారీ, ఆరోగ్యశ్రీ పథకంతో లక్షలాది మందికి ప్రయోజనం కల్పించినట్లు పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల మనిషిని,మరపురాని మహానేత అన్నారు.ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో ఆయన రూపొందించిన పథకాలు దేశానికే దిక్సూచీల మారాయని గుర్తు చేశారు.వైఎస్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని

పిలుపుచ్చారు.వైఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికి కొనసాగుతున్నాయని చెప్పారు. నిరుపేదల బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని వివరించారు.రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం హాయంలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి అన్నారు.నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు నాయకులు దేవేందర్ గౌడ్, తదితరులు ఉన్నారు.



బుద్వేల్ చౌరస్తాలో వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కేవస్ దయానంద్

# రైతు గుండెల్లో నిలిచిన దేవుడు డా.వైయస్సార్

### పాలమూరు ప్రాజెక్టులు వైయస్ పుణ్యమే : మార్కెట్ యార్డు చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్

**కొత్తకోట, సెప్టెంబర్ 2(నమస్తే ఉదయం):** రైతు సంక్షేమం కోసం అనుక్షణం పరితపించిన నాయకుడు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని మదనాపురం వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ అన్నారు సోమవారం దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా కొత్తకోట పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ వర్ధంతి కార్యక్రమానికి మార్కెట్ యార్డు చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



ఈ సందర్భంగా మార్కెట్ యార్డు చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి లు మాట్లా డుతూ... పేదవాడి,రైతుల ముఖంపై చిరునవ్వు వెలిగించడానికి నిరంతరం శ్రమించి జలయజ్ఞంతో సాగునీటి ప్రాజెక్టులను విస్తరించి కోటి ఎకరాల సాగుభూమితో అన్నపూర్ణ గా విరాజిల్లాలని పట్టుదలతో కృషి చేసారు. రైతులకు ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం చేయడం, పీకల లోతు అప్పుల్లో మునిగి ఉన్న రైతులకు ఏకకాలంలో లక్ష రూపాయలు రుణమాఫీ చేసి రుణ విముక్తి కలిగించారు.పేదరికం లోపంతో గుండె జబ్బుల బారిన పడిన నిరుపేదలకు 'ఆరోగ్యశ్రీ 'తో ఖరీదైన వైద్యాన్ని అందించారన్నారు.

108 ద్వారా అత్యవసర అంబులెన్సు వాహనాలను అందు బాటులోకి తెచ్చారు. విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య కోసం 'ఫీజు రీ -ఇంబర్స్ మెంట్' పథకాన్ని ప్రవేశ పెట్టారు. ముస్లిమ్ మైనారిటీ విద్యార్థులకు 4 శాతం రిజర్వేషన్లతో ఇంజనీరింగ్ విద్యను అందించారు.

దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం హాయంలో బీడు పడ్డ పాలమూరు రైతన్న పొలాలకు సాగునీటి ప్రాజెక్టులు అయిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, బీమా ఎత్తిపోతల పథకం, నెట్టెంపాడు ప్రాజెక్టు, కోయిల్ సాగర్ ప్రాజెక్టులు నిర్మించి పాలమూరు రైతన్నలకు 8 లక్షల ఎకరాల ఆయకట్టు పొలాలకు సాగునీరు అందించిన దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి పుణ్యమే నేడు పాలమూరులో ప్రాజెక్టులు పంట పొలాలు కలకలలాడుతూ పచ్చబడ్డాయన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పి జె బాబు,మాజీ మార్కెట్ చైర్మన్ బాలనారాయణ, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శులు ఎన్ జే బోయేజ్, పి కృష్ణారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మేస్త్రి శ్రీనివాసులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్, మండల కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి,కౌన్సిలర్ రామ్మోహన్ రెడ్డి, మాజీ సర్పంచులు శేఖర్ రెడ్డి, సాయి రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రామచంద్రయ్య, జెసిపి రాములు, బాదం వెంకటేశ్వర్లు,మాజీ వార్డు మెంబర్స్ గంగు బాల్ రెడ్డి, జే సుభాష్, పి మోహన్ రెడ్డి, పి రవీందర్ రెడ్డి,గుంత రమణ లక్ష్మయ్య యాదవ్,నరసింహయ్య శెట్టి, సాయిలు యాదవ్, ఎండి ముజీబ్,అంజన్న యాదవ్, ఎండి తయాబ్, జెకె రాజు, పి శంకర్ యాదవ్, భాస్కర్ యాదవ్, ఎండి మతిన్, ఎండి షాకీర్, మొద్దు నవీన్ రెడ్డి, శ్రీనివాసులు, రాములు యాదవ్, ముంత బాలరాజ్, ముంత సాయిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్గీయ డాక్టర్ వైఎస్ఆర్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



### వైఎస్ చిత్రపటానికి

## రేవంత్ నివాళి

**హైదరాబాద్,సెప్టెంబర్ 2(నమస్తే ఉదయం):** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి ఆయనకు నివాళులు అర్పించారు. జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో వైఎస్సార్ చిత్రపటానికి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఈ మేరకు వైఎస్ఆర్ ఫొటోను ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తూ సిఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'పేదల హృదయాల్లో తడి ఆరని సంక్షేమ సంతకం, తెలుగు ప్రజల మనసుల్లో అభిమానపు ప్రతిరూపం' డాక్టర్ వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నా ఘన నివాళి అని సిఎం రేవంత్ తెలియజేశారు. కాగా, ఆంధ్రప్రదేశ్ మాజీ సిఎం, దివంగత నేత వైఎస్ఆర్ 2009 సెప్టెంబర్ 2న ఆంధప్రదేశ్ లో రచ్చబండ కార్యక్రమానికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. నల్లమల్ల అడవిలో పావురాల గుట్ట వద్ద హెలికాప్టర్ కూలిపోవడంతో వైఎస్ మరణించిన విషయం తెలిసిందే.

# జాతీయ విపత్తుగా ప్రకటించాలి

(మొదటిపేజీ తరువాయి..)

రాజకీయ ప్రయోజనాల కోసం మేము పనిచేయం.వర్షాల కారణంగా జనం సర్వం కోల్పోయారు. ప్రజలకు చిల్లిగవ్వ కూడా కల్వకుంట్ల కుటుంబం ఇవ్వదు. కల్వకుంట్ల కుటుంబం దోచుకున్న రూ. లక్షల కోట్ల సొమ్ములో రూ. వెయ్యి కోట్లో.. రూ. రెండు వేల కోట్లో బాధితులకు సహాయంగా ఇవ్వవచ్చు కదా? చనిపోయిన



వారి కుటుంబాలకు రూ.5 లక్షల రూపాయల పరిహారం చెల్లిస్తాం.

పంట దెబ్బతిన్న ప్రతి ఎకరానికి 10 వేలు పరిహారం ఇస్తాం. వర్షాల కారణంగా నష్టపోయిన ప్రతి ఇంటికి తక్షణ సాయంగా రూ.పదివేలు ఇస్తున్నాం. తక్షణ అవసరాల కోసం జిల్లాకలెక్టర్ ఖాతాలో ఐదు కోట్లు వేశాం. వరదలపై గత ప్రభుత్వం ఒక పాలసీ ని కూడా రూపొందించలేదు.

రాష్ట్రంలోని యంత్రాంగాన్ని పూర్తిగా అప్రమత్తం చేశాం. ఇళ్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం. రాబోయే ఐదారు రోజులు అధికారులు అప్రమత్తంగా ఉండాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపైన చర్యలు తీసుకోవాలి. వరద సహాయక చర్యల్లో పోలీసులు పాల్గొనాలి.



ప్రజలను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత. కొన్ని పార్టీలకు చెందిన మీడియా పోకడలు మారకపోతే ప్రజలే చూస్తారు. వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు బాధితులను ఆదుకోవాలి. ఖమ్మం జిల్లా మంత్రులతో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బాగా పనిచేస్తున్నారు.

# ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలి

- ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
- మంజీరా బ్యారేజ్‌ను సందర్శించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**హైదరాబాద్, సెప్టెంబర్ 2(నమస్తే ఉదయం):** సంగారెడ్డి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాణ ఆస్తి నష్టం కాకుండా అధికారులు అవసరమైన అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.

సోమవారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు,మాజీ ఎమ్మెల్యే పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి లతో కలిసి సంగారెడ్డి మండలంలోని మంజీరా బ్యారేజ్‌ను పరిశీలిం చారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. వర్షాల కారణంగా ప్రాణ నష్టం జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. జిల్లాలోని ఆందోల్, న్యాల్కల్ , బొల్లారం తదితర మండలాలలో అధిక వర్షపాతం నమోదు అయినందున ఆయా ప్రాంతాలలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు అధికా రులు



తరలించినట్లు తెలిపారు.

సంగారెడ్డి జిల్లాలోని మంజీరా బ్యారేజ్ పూర్తి నీటి సామర్థ్యం ఒకటిన్నర టీఎంసీలు కాగా బ్యారేజ్ పూర్తిగా నిండడంతో ఒక గేటు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నట్లు తెలిపారు. ప్రాజెక్టులోకి ఇన్ఫ్లో 2300 క్యూసెక్కులు ఉండగా అవుట్ ఫ్లో 3100 క్యూసెక్కులు నీటిని కిందికి వదులు తున్నట్లు మంత్రి తెలిపారు.

దీంతో మంజీరా తీరా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. వర్షాలలో సహాయక చర్యలు చేపట్టడానికి జిల్లా స్థాయిలో సంగారెడ్డి కలెక్టరేట్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్ కు వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

విద్యుత్ శాఖకు సంబంధించి ప్రత్యేకంగా సంగారెడ్డిలోని ఎస్ఈ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చెరువులు కుంటలు వాగులలో భారీగా వరద నీరు వస్తున్నడంతో నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తమై అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

చెరువులో వాగులు వంకల వైపు ప్రజల వెళ్లకుండా చూడాలని రెవెన్యూ పోలీస్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రోడ్లపై వాగులు ప్రవహిస్తున్న చోట్ల అవసరమైతే బారికేడ్ లు ఏర్పాటు చేసి ప్రజలు , వాహనాలు వెళ్లకుండా జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 48 గంటల్లో కూడా భారీ వర్షాలు జిల్లాలో పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని జిల్లాలో ప్రాణ నష్టం జరగకుండా అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.నీట మునిగిన పంట పొలాలకు, వర్షాల వల్ల కూలిన ఇండ్లకు ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు.



# కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు అండగా ఉంటా...

### శుద్ధమైన తాగునీటి కోసం ఫిల్టర్ ఏర్పాటు.


### బాలికలకు బాత్ రూమ్‌ల నిర్మాణం.

### పాఠశాల భవనానికి కొత్త రంగులు వేయించడానికి ముందుకు వచ్చిన సంఘ సేవకుడు సిద్దు రెడ్డి

**శంషాబాద్,సెప్టెంబర్ 2(నమస్తే ఉదయం):**
శంషాబాద్ మండలంలోని పాలమాకుల కస్తూర్బా గురుకుల పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చడానికి ప్రముఖ సంఘ సేవకుడు కందకట్ల సిద్దు రెడ్డి ముందుకు వచ్చాడు. సోమవారం శంషాబాద్ ఇనిస్పెక్టర్ నరేందర్ రెడ్డి. ప్రముఖ సినీ నటుడు బొద్ధం ఇంద్రసేన. కోడి గంటి ప్రశాంత్ రెడ్డితో కలిసి ఆయన పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఉంటున్న బాలికలకు బాత్రూంల సమస్య ఉన్నట్లు ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. వీటితోపాటు తాగునీటి సమస్య కూడా ఉన్నట్లు తెలిపారు. ఈ సమస్యలను శాశ్వతంగా దూరం చేసేందుకు గాను అవసరమైన బాత్రూంలను నిర్మించడానికి ఆయన సంసిద్ధత వ్యక్తం చేశారు. అదేవిధంగా విద్యార్థులు శుద్ధమైన మంచినీటిని తాగేందుకు వీలుగా వాటర్ ఫిల్టర్ ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల భవనం రంగులు వెలిసిపోయి పురాతనంగా కనిపిస్తున్నందున భవనానికి నూతనంగా రంగులు వేయిస్తానని ఆయన ప్రకటించారు. కేవలం సామాజిక స్పృహ తోనే ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు అందించేందుకు అయ్యే ఖర్చులను తాను సొంతంగా భరిస్తానని సిద్దు రెడ్డి తెలిపారు. పాఠశాలలో ఉన్న దాదాపు 400 మంది విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నందున వాటిని పరిష్కరించడం కోసం తన వంతు సహాయం అందిస్తానని స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నదని అయినప్పటికీ కొన్ని సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే తన సొంత డబ్బులతో వాటిని తీరుస్తానని హామీ ఇచ్చారు.

## జెడ్పీ మాజీ చైర్మన్ రత్నంకు శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టులు

**శంషాబాద్,సెప్టెంబర్ 2(నమస్తే ఉదయం):**
రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్. చేవెళ్ల మాజీ శాసనసభ్యుడు కేఎస్ రత్నం పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం కె ఎస్ రత్నం జన్మదినం సందర్భంగా ఆయన



మాజీ జడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కే ఎస్ రత్నంకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న జర్నలిస్టులు

నివాసగృహం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులతో కోలాహలంగా మారింది. చేవెళ్ల నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాలకు చెందిన భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా సీనియర్ జర్నలిస్టు బొడ్డు మనోహర్, ప్రభాత ఉదయం దినపత్రిక ఎడిటర్ కోట్ల చంద్రకాంత్ వడ్ల రవీందర్ చారి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. కేఎస్ రత్నం నివాస గృహంలో ఆయనకు శాలువాతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## రాజేంద్రనగర్ డివిజన్‌లో పెద్ద ఎత్తున బీజేపీ సభ్యత్వం చేపట్టాలి

**రాజేంద్రనగర్, సెప్టెంబర్2(నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్ డివిజన్‌లో బీజేపీ 20 వేల మందితో సభ్యత్వం చేయించాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఉపేందర్ రెడ్డి అన్నారు. సోమవారం ఉప్పర్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు అధ్యక్షతన జరిగిన సభ్యత్వ నమోదు ప్రేపరషన్ మీటింగ్‌కు ఇంచార్జిగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టా ఉపేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాజేంద్రనగర్ డివిజన్‌కు 20వేల సభ్యత్వ టార్గెట్ ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతి బూత్‌కు 400 మందికి తగ్గకుండా సభ్యత్వం చేయాలన్నారు. బీజేపీ పార్టీలో చేరడానికి యువత సిద్ధంగా ఉందన్నారు. ప్రజలు రాజేంద్రనగర్



సమావేశంలో మాట్లాడుతున్న పి.ఉపేందర్ రెడ్డి

డివిజన్‌లో గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ పార్టీని ఆదరించారని, మంచి మెజారిటీని అందించారని గుర్తు చేసారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, మక్తల్ అసెంబ్లీ ఇంచార్జి బొక్క బాల్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి సత్యనారాయణ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎస్. విఠల్, కీర్తి శ్రీనివాస్, పవన్ రాజ్ , మల్లేష్ చారి, జి.పద్మావతి, ఆర్. రాకేష్ గౌడ్, ప్రకాష్ నాయక్, హర్షిత్ రెడ్డి, పవన్, రాజ్ పాల్ రెడ్డి, రమాకాంత్, వెంకటేశ్వర్లు తదిదరులు పాల్గొన్నారు.

# సమ్మెలో పాల్గొన్న విద్యుత్ ఆర్టిజన్లకు రీ పోస్టింగ్

### పోస్టింగ్ ఇచ్చిన టీజీఎస్పీడీసీఎల్ సీఎండి ముషారఫ్‌కు కృతజ్ఞతలు తెలిపిన అసోసియేషన్‌లు

**హైదరాబాద్, సెప్టెంబరు 2(నమస్తే ఉదయం):**
తెలంగాణా దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థలో పనిచేస్తూ సమ్మెలో పాల్గొన్న ఆర్టిజన్లకు పనిష్మెంట్ కింద ఇతర సర్కిల్ లకు బదిలీ చేసిన వారిని సోమవారం రి పోస్టింగ్ చేశారు. సోమవారం ఈ మేరకు టీజీఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్టిజన్ సర్వీసెస్ చట్టవిరుద్ధమైన సమ్మెలో పాల్గొనడం, ఇతర ఉద్యోగులను చట్టవిరుద్ధమైన సమ్మెలో పాల్గొనేలా ప్రేరేపించడం, ఆర్థిక సహాయం అందించడం వంటి దుష్ప్రవర్తన w.ef 25.04.2023 ఎఫ్.ఎఫ్.ఎఫ్ 25.04.2023న దుర్వినియోగం చేసిన కొంతమంది(ఆర్టిజన్లు) కళాకారులను సర్వీస్ నుండి తొలగించబడ్డారు. అయితే సంస్థ పనిచేస్తున్న ఆర్టిజన్ల అసోసియేషన్ల విజ్ఞప్తి మేరకు సర్కిల్‌లు,డివిజన్‌లకు కేటాయించబడింది. వారి మాతృ యూనిట్‌లకు స్వదేశానికి తిరిగి వెళ్లడం సూచనలు జారీ చేయబడ్డాయి.

2023 సంవత్సరం ఏప్రిల్ 4వ తేదీన ఆర్టిజన్లను సర్వీసు నుంచి తొలగించారు.

టీజీఎస్పీడీసీఎల్ చట్టవిరుద్ధమైన సమ్మెలో పాల్గొన్నందుకు, ఇతర సహ-ఉద్యోగులను చట్టవిరుద్ధమైన సమ్మెలో పాల్గొనడానికి, అక్రమ సమ్మెకు ఆర్థిక సహాయం అందించడానికి ప్రేరేపించినందుకు సర్వీస్ నుండి తొలగించబడిన 89 మంది ఆర్టిజన్‌లను తిరిగి సర్వీసులో చేర్చుకోవడానికి ఉత్తర్వులు జారీ చేసింది. పునఃస్థాపన తర్వాత (తెలంగాణ అత్యవసర ఎసెన్షియల్ సర్వీస్ మెయింటెనెన్స్(ఎస్మా) చట్టం 1971) కేసులను దాఖలు చేసిన 58 ఆర్టిజన్లను ఇతర సర్కిళ్లకు కేటాయించారు. టెస్మా కేసులు కాకుండా దాఖలైన 31 మంది ఆర్టిసేన్‌లను సర్కిల్‌లోని మరొక విభాగానికి బదిలీ చేశారు. పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు & వ్యక్తులపై



నమోదు చేయబడిన క్రమశిక్షణా కేసుల ఫలితాలకు లోబడి ఉంటుంది.

నిర్దేశించిన ఇతర టర్మ్మ్ & షరతుల ప్రకారం, ఉదహరించిన సూచన 5లో, టీజీఎస్పీడీసీఎల్ 80 సంఖ్యల రీ-ఇన్‌స్టేటెడ్ ఆర్టిజన్‌ల తాత్కాలిక హక్కు & సీనియారిటీ, సర్వీస్ పుస్తకాలను వారి పేరెంట్ యూనిట్‌లో మార్చడం ద్వారా పేరెంట్ యూనిట్‌లోని జీతాలను సక్రమంగా క్లెయిమ్ చేస్తూ నిర్వహించాలని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. పని చేసే యూనిట్ స్థలం నుండి తిరిగి సంబంధిత కళాకారులు యూనియన్‌లు, అసోసియేషన్‌లు వారి మాతృ యూనిట్‌లకు స్వదేశానికి తిరిగి రావడానికి వివిధ ప్రాతినిధ్యాలు అందించబడ్డాయి. యూనియన్లు కోరిన విజ్ఞప్తి మేరకు పైవారిని స్వదేశానికి రప్పించాలని నిర్ణయించారు. ఆర్టిజన్‌లు వారి మాతృ యూనిట్‌లకు, జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత, ఇతర సర్కిల్‌లు,డివిజన్‌లకు కేటాయించబడిన పునరుద్ధరణ పొందిన కళాకారులను తిరిగి స్వదేశానికి రప్పించాలని సిఎండి ఆదేశించారు. ఆర్టిజన్లకు పూర్వ స్థానంలో పోస్టింగ్ ఇచ్చిన సందర్భంగా సీఎం డి ముషారఫ్ కు ఈతేహాద్ విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి అలీఖాన్ (షాకీర్), ఉపాధ్యక్షుడు సయ్యద్ కరీమొద్దీన్, ప్రధాన కార్యదర్శి సిహెచ్.నందీశ్వర్, సంయుక్త కార్యదర్శి ఎండి ఖాజా రహమత్ అలీ, తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షౌఖత్‌పాషా, ప్రధాన కార్యదర్శి సాయిలులు వినతి పత్రం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.







# శివనామ స్మరణతో మారుమోగిన వెండికొండ...

### భక్తులతో కిటకిటలాడిన సిద్దుల గుట్ట...

### స్వామివారిని దర్శించుకున్న కొండ విశ్వేశ్వర్ రెడ్డి,కార్తీక్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, తోకల శ్రీనివాస్ రెడ్డి

### పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టిన ఉత్సవ కమిటీ

**శంషాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే ఉదయం):**
శంషాబాద్ ప్రజల ఇలవేల్పు ఆరాధ్య దైవం శ్రీ వెండికొండ సిద్దేశ్వర స్వామి ఆలయం శివనామస్మరణతో మారు మ్రోగింది. శంభో శంకర మహాదేవ అంటూ భక్తులు చేసిన నినాదాలతో వెండికొండ ప్రాంతం భక్తి పారవశ్యంలో మునిగి తేలింది. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో స్వామివారి దర్శనం కోసం భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. శంషాబాద్ వర్తక సంఘం. దాదాపు గత 70 సంవత్సరాలుగా స్వామివారికి శ్రావణమాసం చివరి వారంలో జాతరను జరపడం ఆనవాయితీగా వస్తున్నది. శనివారం స్వామివారి ఉత్సాహ విగ్రహాల ఊరేగింపు ఆది సోమవారాల్లో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలను నిర్వహించడం అనాదిగా వస్తున్నది. దేవాలయం దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్నప్పటికీ వర్తక సంఘం. జాతర నిర్వాహక సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహిస్తూ ఉంటారు. స్వామివారికి అభిషేకాలు. అమృత స్నానం. ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు.



అనంతరం శివపార్వతుల కళ్యాణాన్ని కనుల పండుగ నిర్వహిస్తారు. ఇక్కడికి వచ్చే భక్తులకు ఆది సోమవారాల్లో పంచపక్ష పరమాన్నాలతో భోజనాలను వడ్డిస్తారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి. టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి. ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్. మైలార్దేవ్పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి. స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు కొలను సుష్మా మహేందర్ రెడ్డి. బండి గోపాల్ యాదవ్..డాక్టర్ ప్రేమ్ రాజ్. గణేష్ గుప్తా. కొత్త నరసింహారెడ్డి. శంకర్ రెడ్డి. చక్రధర్ రెడ్డి. అడియాల అరుణప్ప. మేకల వెంకటేష్ ముదిరాజ్. బండి శ్రీకాంత్ యాదవ్. కొండా పరమేష్ గౌడ్ . మునగాల అమృత రెడ్డి, కోనమొల్ల శ్రీనివాస్. జిల్లపల్లి శ్రీనివాస్.తోకల మురళి యాదవ్, రాహుల్ గాజుల, కొండోజు ప్రకాష్‌చారి, వెండి కొండ సిద్దేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మడపతి నరేందర్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# దేశంలోనే అతిపెద్ద పార్టీ బిజెపి

### బిజెపి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు దుద్దాల లక్ష్మీనారాయణ

### భారీ సంఖ్యలో సభ్యత్వ నమోదు చేపట్టాలి

### పార్టీ శ్రేణులకు సూచన

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 2(నమస్తే ఉదయం):**
స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి, కేంద్ర మాజీ హోం శాఖ మంత్రి ఎల్ కే అద్వానీల నాయకత్వంలో పురుడు పోసుకున్న భారతీయ జనతా పార్టీ ప్రజలకు సేవ చేస్తూ దేశంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందని బిజెపి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు దుద్దాల లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం అత్తాపూర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు శాబాద విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవ కార్యక్రమానికి బిజెపి రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు దుద్దాల లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ... కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో కొనసాగుతున్న ప్రభుత్వం దేశ సమగ్రత కోసం చేపడుతున్న అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బిజెపి సభ్యత్వ నమోదు చేసుకునే విధంగా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ప్రతి బూతులో 200 మందికి పైగా సభ్యత్వం చేయాలని తెలియజేసినారు. 2 వ తేదీ న భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభిస్తున్న బిజెపి సభ్యత్వ నమోదు కొరకు అందరూ 8800002024 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు అందరూ 100 మందికి పైగా సభ్యత్వము నమోదు చేయించాలని కోరినారు. అత్తాపూర్ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి 20వేల మందితో ప్రతి ఒక్కరితో




సభ్యత్వము చేయించాల న్నారు. సభ్యత్వ కార్యక్రమాన్ని ఒక పండుగలా నిర్వహించాల న్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి మోంద్ర కొమురయ్య, మల్లారెడ్డి,సుదర్శన్ ప్రసాద్ తివారి, రాచూరి రాజశేఖర్, కుక్కునూరి కిరణ్ చారి, రావుల జగన్, శెట్టిగారి శేఖర్, అమృత, శశికాంత్ శర్మ, కే. బాలకృష్ణ, మ్యాడం రాము, ఎస్. యాదగిరి రెడ్డి, విజయ్ రావుత్, ఎస్. రామ్ గోపాల్ యాదవ్, ఉమా శంకర్, అశోక్ కుమార్, దేవేందర్, కప్లేగూడెం బాలకృష్ణ, యువకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రగ్యా సర్‌ప్రైజింగ్ షో

తమిళ చిత్రం 'విరాటు' తో 2014లో సినీ రంగ ప్రవేశం చేసిన ప్రగ్యా జైస్వాల్ తెలుగు లో కూడా అదే టైమ్ లో ఎంట్రీ ఇచ్చింది. తెలుగు లో మొదటి సినిమా మిర్చి లాంటి కుర్రాడు సినిమా నిరాశ పరిచింది. మొదటి సినిమా నిరాశ పరచినా కూడా 'కంచె' సినిమాలో నటించే అవకాశం ప్రగ్యాకు వచ్చింది. క్రిష్ దర్శకత్వంలో కంచె సినిమాలో మెగా హీరో వరుణ్ తేజ్ కి జోడీగా ప్రగ్యా జైస్వాల్ నటించింది. ఆ సినిమా తో ఒక్కసారిగా టాలీవుడ్ లో ఫేమస్ అయ్యింది. కంచె సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు, ఆ సినిమాలో ప్రగ్యా అందానికి, నటనకు మంచి మార్కులు పడ్డాయి. కంచె సినిమా తర్వాత టాలీవుడ్ లో ప్రగ్యా వరుసగా ఆఫర్లు దక్కించుకునే అవకాశం ఉందని అంతా భావించారు. కానీ ఆమె ఎత్తు టాలీవుడ్ లో ఉన్న చాలా మంది యంగ్ హీరోల కంటే కాస్త ఎక్కువగానే ఉంది. దాంతో ప్రగ్యా తో నటించేందుకు చాలా మంది ఆసక్తి చూపించలేదు. కంచె తర్వాత ఆమె చేసిన సినిమాలు కొన్ని పర్వాలేదు అనిపించుకోగా, ఎక్కువ సినిమాలు బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడ్డాయి. అయినా కూడా ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంది. బాలయ్యకు జోడీగా నటించిన అఖండ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. అయినా కూడా ఆశించిన స్థాయిలో ఈమెకు ఆఫర్లు రాలేదు. సినిమాల్లో ఆఫర్లతో సంబంధం లేకుండా సోషల్ మీడియాలో ఈమె అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది.

అన్ని భాషల నెటిజన్స్ ప్రగ్యా జైస్వాల్ యొక్క అందమైన ఫోటోలకు ఫిదా అవుతూ ఉంటారు. నెట్టింట ఆమె షేర్ చేసే ఫోటోలు రెగ్యులర్ గా వైరల్ అవుతున్నాయి. తాజాగా మరోసారి ప్రగ్యా జైస్వాల్ అందమైన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈసారి లేత గోధుమ రంగు లో ప్రగ్యా సర్‌ప్రైజింగ్ అందాల షో కు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు.



# ఘనంగా బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవ వేడుకలు

## - జై బాలయ్య అంటూ నినాదాలు!

నటుడిగా నందమూరి బాలకృష్ణ ప్రయాణానికి 50 ఏళ్లు. ఈ సందర్భంగా తెలుగు చలన చిత్ర పరిశ్రమ హైదరాబాద్‌లో ఆదివారం భారీ స్థాయి స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించింది. టాలీవుడ్‌తోపాటు ఇతర సినీ పరిశ్రమల ప్రముఖులు, రాజకీయ ప్రముఖులు తరలివచ్చారు. బాలకృష్ణతో సినిమాలు చేసిన దర్శకులతో పాటు సినీ ప్రముఖులు చిరంజీవి, వెంకటేశ్, శ్రీకాంత్, రానా, నాని, గోపీచంద్, శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర, రాఘవేంద్రరావు, బీ.గోపాల్, పరుచూరి బ్రదర్స్, సిద్దు జొన్నలగడ్డ, విజయ్ దేవరకొండ, అల్లరి నరేష్, నిర్మాతలు డి సురేష్ బాబు, జెమినీ కిరణ్, సుహాసిని, ఇంద్రజ, మాలశ్రీ, సుమలత తదితరులు ఈవెంట్‌లో పాల్గొన్నారు. నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ " రోజు ఇంతమంది అభిమానులు, నా తోటి నటీనటులు, నాతో పని చేసిన ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. నాకు జన్మను ఇచ్చిన తల్లి తండ్రులకు, నాకు ఇంతటి అభిమానాన్ని ఇచ్చిన మీ అందరినీ నా గుండెల్లో పెట్టుకుంటాను. అలాగే నా కుటుంబం అయిన నిర్మాతలు, దర్శకులు, నటులు, కళాకారులు, సాంకేతిక బృందం, నా హాస్పిటల్ బృందం, హిందూపూర్ ప్రజలు, నా అభిమానులు అంత కలిసి ఈ వేడుకను ఇంత గొప్ప విజయం పొందేలా చేసినందుకు పేరు పేరునా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. దీనికి వెనుక ఉంది నడిపించిన మా అసోసియేషన్, నిర్మాతల మండలి, ఛాంబర్ దితరులకు ప్రత్యేక ధన్యవాదాలు. నేను నా తండ్రి నుండి నేర్చుకున్నది నటన మాత్రమే కాదు. క్రమశిక్షణ, సమయానుకూలంగా, సంస్కారం. అలాగే అక్కినేని నాగేశ్వరరావు గారు దగ్గర నుండి అదే నేర్చుకున్నాను. అలాగే నేను చేసే ప్రతి పనిలో అండగా ఉంటున్న నా భార్య వసుంధరకు ధన్యవాదాలు" అని అన్నారు.



# శ్రీను వైట్ల దర్శకత్వంలో గోపీచంద్ చిత్రం విశ్వం

టాలీవుడ్ యాక్టర్ గోపీచంద్ నటిస్తోన్న చిత్రం విశ్వం శ్రీను వైట్ల దర్శకత్వంలో వస్తోంది. కొన్ని రోజుల క్రితం జర్నీ ఆఫ్ విశ్వం వీడియోను షేర్ చేయగా.. ఫన్, సీరియస్ ఎలిమెంట్స్‌తో సినిమా సాగనున్నట్టు చెప్పకనే చెబుతోంది. మళ్లీ చాలా రోజుల తర్వాత ఈ మూవీకి సంబంధించిన అప్‌డేట్‌ను టీజర్ రూపంలో అందించింది శ్రీను వైట్ల టీం. విశ్వం టీజర్‌ను మంగళవారం సాయంత్రం 4:05 గంటలకు లాంచ్ చేస్తున్నట్టు తెలియజేస్తూ స్టైలిష్ లుక్ షేర్ చేశారు. ఇప్పుడీ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీని చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌పై పాపులర్ డిస్ట్రిబ్యూటర్ కమ్ ఎగ్జిబిటర్ వేణు దోనెపూడి పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి తెరకెక్కిస్తున్నారు. గింజ గింజపై తినేవాడి పేరు రాసి ఉంటుంది. దీనిపై నా పేరు ఉంది.. అంటూ ఫస్ట్ స్ట్రైక్‌లో గోపీచంద్ చెబుతున్న డైలాగ్స్ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రంలో కావ్యథాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది. గోపీమోహన్ స్క్రీన్ ప్లే సమకూరుస్తుండగా.. చేతన్ భరద్వాజ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ సారి గోపీచంద్ ఫుల్ లెంగ్త్ యాక్షన్ ప్యాక్‌డ్ రోల్‌లో కనిపించబోతున్నట్టు అర్థమవుతోంది. చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌లో వస్తున్న తొలి సినిమా ఇది. ఇక ఫస్ట్ స్ట్రైక్‌లో తెగిపడటం.. తెగించగలడం క్రమాన ఫలితం.. విధాత విశ్వం అంటూ సాగే టైటిల్ ట్రాక్ సినిమాపై అంచనాలు పెంచుతోంది.

# 'బిల్లా రంగ బాషా' స్పెక్టక్యూలర్ కాన్సెప్ట్ వీడియో

సూపర్ స్టార్ బాద్‌షా కిచ్చా సుదీప్, దర్శకుడు అనూప్ భండారి బ్లాక్ బస్టర్ 'విక్రాంత్ రోణ' తర్వాత మరోసారి చేతులు కలిపారు. హనుమాన్ తో పాన్ ఇండియన్ బ్లాక్ బస్టర్ అందుకున్న నిర్మాతలు కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై హై బడ్జెట్, భారీ కాన్వాస్‌పై ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.కిచ్చా సుదీప్ పుట్టినరోజు సందర్భంగా ఫ్యూచర్ లో జరగబోయే కథను పరిచయం చేసే కాన్సెప్ట్ వీడియోతో పాటు 'బిల్లా రంగ బాషా' అఫీషియల్ లోగో ని మేకర్స్ రివిల్ చేశారు. యూనిక్ అప్రోచ్ సినిమాలు చేయడంలో అనూప్ భండారి దిట్ట. ఈ వీడియో ప్రేక్షకులని మెస్మరైజ్ చేసింది. కాన్సెప్ట్ వీడియో క్రీ.శ. 2209లో జరిగిన భవిష్యత్తు గురించి గ్లింప్స్ ని అందిస్తోంది. ది స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ, ఈఫిల్ టవర్, తాజ్ మహల్ స్మాస్ అయినట్లుగా చూపిస్తూ, ఒక వ్యక్తి అన్నింటినీ జయించినట్లు ప్రజెంట్ చేయడం ఆసక్తికరంగా వుంది. దీనికి మూడు వేర్వేరు ప్రాంతాలు, క్లైమాట్స్ యాడ్ చేశారు. అనూప్ భండారి ఎక్సయిటింగ్ డీటెయిల్స్ తో విజువల్ ప్యాడ్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చారు.

'కిచ్చా సుదీప్‌తో అనూప్ భండారి సినిమా చేస్తున్నారని మొదట విన్నప్పుడు చాలా ఎగ్జైట్ అయ్యాం. విక్రాంత్ రోనా తెలుగులో విజయవంతమైంది. ఈ కొలాబరేషన్ ఇప్పటికే సంచలనం సృష్టించింది. బిల్లా రంగ బాషా కథ విన్నప్పుడు, ఇది మేమే నిర్మించాలి అనే నమ్మకం కలిగింది. సూపర్‌స్టార్ కిచ్చా సుదీప్‌తో సినిమా చేయడం గొప్ప అవకాశం. షూటింగ్ ప్రారంభం కావాలని, ప్రేక్షకులు బిల్లా రంగ బాషా ప్రపంచాన్ని చూడాలని ఎదురుచూస్తున్నాం' అని నిర్మాతలు తెలిపారు. బిల్లా రంగ బాషా అన్ని ప్రధాన భారతీయ భాషలలో నిర్మాణమౌతుంది. అతి త్వరలో షూటింగ్ ప్రారంభం కానుంది.






# నా సినిమాపై సెన్సార్ బోర్డు ఎమర్జెన్సీ అసహనం వ్యక్తంచేసిన కంగనా రనౌత్

కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'ఎమర్జెన్సీ'ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం తాజాగా మరోసారి వారం రోజులు వెనక్కి వెళ్లింది. సెప్టెంబర్ 6న ప్రేక్షకుల ముందుకురావాల్సిన ఈ చిత్రం మరికొన్ని రోజులు ఆలస్యం కానుంది. ఈ సినిమాపై సెన్సార్ బోర్డు కొన్ని అభ్యంతరాలు చెప్పినట్లు తెలుస్తోంది. తాజాగా దీనిపై కంగనా స్పందించారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ అసహనం వ్యక్తంచేశారు. 'నా సినిమాపై కూడా ఎర్జెన్సీ విధించారు. ఇది చాలా విచారకరమైన పరిస్థితి. నేను నిరాశకు గురయ్యాను' అని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఇక సెన్సార్ బోర్డ్‌ను విమర్శిస్తూ.. ఓటీటీలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'దేశంలోని చట్టం ఏంటంటే.. ఓటీటీలో అయితే ఎటువంటి సెన్సార్ ఉండదు. అనూహ్యమైన హింసను, అశ్లీలతను ప్రదర్శించవచ్చు. రాజకీయంగా పలుకుబడి ఉంటే నిజజీవిత సంఘటనలను కూడా వక్రీకరించి సినిమాలు తీయొచ్చు. ఓటీటీల్లో అంత స్వేచ్ఛ ఉంటుంది. కానీ ఆ స్వేచ్ఛలో కొంచెం కూడా మాలాంటి వాళ్లకు ఉండదు. అందుకే భారతదేశ సమగ్రత, ఐక్యత చుట్టూ తిరిగే చిత్రాలను తీయడానికి మాకు అనుమతి ఉండదు. కొన్ని చిత్రాలు తీయడానికి మనలో కొంతమందికి మాత్రమే సెన్సార్‌షిప్ ఉంది. ఇది అన్యాయం' అని పేర్కొన్నారు. తాను ఆత్మగౌరవంతో ఈ చిత్రాన్ని నిర్మించినట్లు తెలిపారు. సెన్సార్‌బోర్డ్ సర్టిఫికెట్ ఇవ్వకపోతే తాను కోర్టులో పోరాడటానికైనా సిద్ధమేనన్నారు.

# 'కన్నప్ప' నుంచి 'కాలాముఖ'గా అర్పిత్ రంకా ఫస్ట్ లుక్

విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రాబోతోన్న 'కన్నప్ప' నుంచి ప్రతీ సోమవారం ఒక అప్డేట్ వదులుతున్నారు. సినిమాలోని ప్రతీ పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసి బజ్ పెంచేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటి వరకు శరత్ కుమార్, మధుబాల, దేవరాజ్, ముఖేష్ రిషి, మంచు అవ్రామ్ పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేయగా.. అవన్నీ మంచి హైప్ క్రియేట్ చేశాయి. తాజాగా మరో పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను టీం విడుదల చేసింది. కన్నప్ప నుంచి కాలాముఖ పాత్రకు సంబంధించి అర్పిత్ రంకా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. గాంధార దేశం.. వాయు లింగం సొంతం చేసుకునే ధ్యేయం.. వేలాది మంది రక్తపాతాన్ని చూసే దాహం.. అడివిని,అడవి వీరుల్ని సైతం అంతం చేసే క్రూరత్వం అంటూ కాలాముఖ పాత్రకు ఇచ్చిన ఎలివేషన్, పోస్టర్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. ఇప్పటికే కన్నప్ప టీజర్‌తో సినిమా మీద భారీ అంచనాలు ఏర్పడ్డాయన్న సంగతి తెలిసిందే. విష్ణు మంచు టైటిల్ రోల్‌లో కనిపించనున్న కన్నప్ప అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా రాబోతోంది.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733